# వీడని బంధం

రచన :
శ్రీ తమ్మిశెట్టి రామారావు

సాయం సంధ్య వేళ.

చల్లని పిల్లతెమ్మెర వీస్తోంది. ఆ ఇంటి ముందు కాలి బాట కిరు ప్రక్కలవున్న పూల మొక్కలు, వుండుండి వీస్తున్న చిరుగాలికి సువాసనల్ని వెదజల్లుతున్నాయి.

వరండాలో చలపతి, మోహన్ కూర్చున్నారు.

"అయితే పనిమీద వస్తూ, పనిలో పనిగా ఇక్కడ దిగి, నన్ను చూసి పోవాలని వచ్చావన్న మాట?" టీపాయ్ మీది సిగరెట్ పాకెట్టు అందుకుంటూ అన్నాడు చలపతి.

"ఔను!" అన్నాడు మోహన్, మొహాన్ని దించుకుంటూ.

"ఐ. సీ!" అంటూ ఒక సిగరెట్ మోహన్‌కి ఆఫర్ చేశాడు చలపతి.

"నో హాబిట్." అంటూ తిరస్కరించాడు మోహన్.

"రియల్లీ!" అంటూ నవ్వుకున్నాడు చలపతి.

"నీ ఫస్టు అప్పాయింట్‌మెంట్ ఇక్కడేకదూ?" మాట వరసకి అన్నాడు మోహన్.

"అవును! నేను మెడిసన్ పూర్తి చేసేసరికి, ఈ వూరికి గవర్నమెంటు ప్రైమరీ హెల్త్ సెంటర్ పెట్టింది. మా మావగారి పలుకుబడితో నా కిక్కడే వుద్యోగం దొరికింది. ఎంతైనా ఆయన ఎమ్మెల్లే కదా?"

"గుడ్! అదృష్టవంతుడివి. కను సన్నల్లో కళత్రం. కదలకుండా వుద్యోగం." తెలివిగా అన్నాడు మోహన్.

"నువ్వు మాత్రం తక్కువ తిన్నావట్రా! పెళ్ళి కాక ముందే మీ కాబోయే మామగార్ని హైద్రాబాద్ పంపించావు. ఇంజనీర్ అయి కూర్చున్నావు. అదృష్టమంటే నీది, బై ది బై. నీక్కాబోయే భార్య ఎలా వుంటుంది? చెప్పవోయ్!"

"నీ భార్య అంత అందంగా మాత్రం వుండదులే!" అన్నాడు మోహన్ అప్పుడే ట్రేతో వచ్చిన నళిని వంక చూస్తూ.

చెరొక కప్పు అందించి తానొక కప్పు తీసుకుంటూ కుర్చీలో కూర్చుంది నళిని.

"నళినీ! మోహన్‌న్ని తెలుసా?" అన్నాడు చలపతి.

"తెలియకేం? ఇంటర్‌లో నా క్లాస్‌మేట్." అంది మాట కలుపుకుంటూ నళిని.

"అయినా మోహన్ మన పెళ్ళికి రాలేదు. అంతేగా?"

"ఇప్పుడు వచ్చాడుగా?" అంది నళిని.

"అవును చెల్లాయ్! మీరు అపార్థం చేసుకుంటారనే ఇప్పుడు పని గట్టుకుని వచ్చాను. ఏదో మళ్ళీ చాన్నాళ్ళకి కాలక్షేపంగా ఓ గంట గడిపి వెళ్ళిపోదామని. అవతల కొత్తగా కడుతున్న రెండు బ్రిడ్జిల్ని చెక్ చేసి బిల్లు పాస్ చెయ్యవలసి వుంది!" అన్నాడు మోహన్.

"అయితే నువ్వు రాధ పెళ్ళికి రాలేదా మోహన్?" అంది నళిని.

"రాధ పెళ్ళికా! రాధ కింకా పెళ్ళి కాలేదా నళినీ!" ఆశ్చర్యంగా అన్నాడు మోహన్.

"లేదు! ఈరాత్రికే పెళ్ళి. కావలిస్తే వెడ్డింగ్ చూడు." అంటూ అక్కడే టేబుల్‌మీద పెట్టిన వెడ్డింగ్ తెచ్చి చూపించింది నళిని.

"అవున్రా! మోహన్ మాటల్లో పడి నేనూ మర్చిపోయాను. ఎలాగూ వచ్చావు గదా! రాధ పెళ్ళి చూసి వుదయాన్నే వెళ్ళిపోదువు గాని!" అన్నాడు చలపతి.

"కుదర్దురా! రాధ పెళ్ళికి వెళ్ళానని తెలిస్తే మా నాన్న చంపేస్తాడు. అసలే మామయ్యకీ, నాన్నకీ మధ్యన పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది;" అన్నాడు మోహన్.

"ప్రేమని పెంచుకోమన్నారు గాని, పగని పెంచుకోమనలేదురా! రాధ ముఖమైనా చూసి నువ్వు ఈ పెళ్ళికి తప్పక వెళ్ళాలి. నీకూ వ్యక్తిత్వం వుందిగా?" అన్నాడు చలపతి.

"కాదనకు మోహన్!" అంది నళిని.

"సరే మీ ఇష్టం. నాకూ రాధ పెళ్ళి చూడాలని ఇష్టంగానే వుంది. తప్పకుండా వెళ్దాం!" అన్నాడు మోహన్.

అంతలో ఫోన్ మ్రోగింది. హాల్లోకి గబగబా వెళ్ళాడు చలపతి. రెండు నిముషాలు తర్వాత హడావుడిగా వచ్చాడు.

"చూడు మోహన్! నాకు అవతల అర్జంటుగా పని తగిలింది. ప్రెసిడెంటుగారి అబ్బాయికి స్కూటర్ ఆక్సిడెంట్‌లో దెబ్బలు తగిలాయట. నేను వెళ్ళి సాధ్యమైనంత తొందరలో వచ్చేస్తాను. ఈలోగా కావలిస్తే నళినీ, నువ్వూ బయల్దేరి వెళ్ళండి. మరేం ఫర్వాలేదు" అన్నాడు చలపతి.

చలపతి అలా స్కూటర్ మీద వెళ్ళిపోయాడో లేదో నళిని తాలూకు దగ్గర బంధువులు వచ్చారక్కడికి.

"ఇప్పుడే వస్తాను" అంటూ నళిని వాళ్ళని రిసీవ్ చేసుకోడానికి వెళ్ళిపోయింది. ఆలోకంలోంచి ఆమె తిరిగి రావడం లేదు.

వరండాలో ఫ్రేమ్ కుర్చీలో మోహన్ ఒక్కడే మిగిలాడు. వర్షం వచ్చేట్టు వుంది. వాతావరణం చల్లగా వుంది.

నళినితో చెప్పి బయటకి నడిచాడు మోహన్.

అల్లంత దూరంలో ఏటిగట్టు కనిపిస్తోంది. ఆ గట్టు మీదనే వేణుగోపాలస్వామి గుడి కనిపిస్తోంది.

సగం దూరం వచ్చేసరికి వర్షం జల్లు పడసాగింది. అడుగుల వేగం పెంచాడు మోహన్. కొంత దూరంలో పెండ్లి పందిరి కనిపించింది. అక్కడ చాలా సందడిగా వుంది. బాదం చెట్టువున్న ఇంటి వరండాలోనికి నడిచాడు మోహన్.

వాళ్ళ మావయ్య పొగచుట్ట చుట్టుకుంటూ వాలుకుర్చీలో కూర్చున్నాడు.

అర తడచిన బట్టలతోవున్న మోహన్ ముఖం వైపు చూశారాయన.

"ఎవరూ మోహనా?" కల్లో చూస్తున్నట్లుగా ఆయన పిలవుతూ అన్నారు.

"అవును! నేనే!" అన్నాడు మోహన్ బింకంగా.

"మీ నాన్న పంపించాడా! లేదా నువ్వే వచ్చావా?" నిలదీసి అడుగుతున్నట్టుగా వుందా మాట.

అంతలో అక్కడకి ఆయన రెండో భార్య యశోదమ్మ వచ్చింది. మోహన్ని చూసి చాలా సంబర పడింది.

"రాకరాక వచ్చిన కుర్రాణ్ణి అలా యక్ష ప్రశ్న[illegible] రేమండి! నీకు కాఫీ తెస్తాను" అంటూ ఆమె లోనికి పోయింది.

యశోద త్తమ్మ మంచిదానిలాగే మోహన్ కి కనిపించింది. మరి నాన్న ఆమె గురించి చెడ్డగా ఎందుకు చెప్పాడో మోహన్ కి బోధ పడలేదు.

బయట చలిగా వుంది. అత్తయ్య అందించిన కాఫీ వెచ్చగా వుంది.

"అయితే ఇంజనీర్ వుద్యోగం చేస్తున్నావన్న మాట"

"అవును మావయ్యా!"


THERE IS JOY
WHERE THERE IS




JOTHI
Engineering Works
Industrial Estate
MADURAI - 625 007.

ATHMAS

"చలపతి చెప్పాడు-వైజాగ్‌లో నీకు పిల్లని చూశారని. ఉద్యోగం కూడా వాళ్ళే చూశారట?"

"అంతా నాన్న ఇష్టప్రకారం జరిగింది!" అన్నాడు చిన్న పిల్లవాడిలా మోహన్.

"పోనీ నువ్వయినా సుఖపడితే చాలు" అంటూ ఆయన ఏదో పనిలో నిమగ్నమై పోయారు మరికొంత సేపటికి.

ఏడింటికి చలపతి వణినితో వచ్చాడు.

భోజనాల ధగ్గర ఒకే పంక్తిలో చలపతి, మోహన్ కూర్చున్నారు. భోజనాల సందడి తగ్గింది.

"ముహూర్తానికి చాలా టైమ్ వుంది. అలా విడిది గదికి వెళ్ళొద్దామా? ఏదో కాలక్షేపం జరుగుతుంది. వరుణ్ణి చూపినట్టూ వుంటుంది" అన్నాడు చలపతి.

తలూపాడు మోహన్. ఇద్దరూ చిరుచినుకుల్లో తడుస్తూ విడిదింటికి వచ్చారు.

"పెండ్లికొడుకుని చూశావా? అక్కడ గాడ్రెజ్ కుర్చీలో కూర్చున్నాడు. బ్లూ షర్టు. లేండ్ లార్డట!" అన్నాడు చలపతి.

"ఊఁ!" అన్నాడు మోహన్ పరధ్యానంగా.

అక్కడే రెండు మూడు గ్రూపులు పేకాడుతున్నారు. చలపతికి పేకాడటం హాబి. అందుకే వాళ్ళలో కలిసి పోయాడు.

మోహన్ మాత్రం ఏమీ తోచకుండా వున్నాడు. కాళీ కుర్చీ లాక్కుని కిటికీకి దగ్గరగా వేసుక్కూర్చున్నాడు.

గదిలోని లైటింగ్ కిటికీలోంచి బయట పడుతోంది. ఆ లైటింగ్‌లో వానధారలు ముత్యాల పేరుల్లా జాలు వారుతున్నాయి.

ఎందుకో మోహన్ ఆలోచన్లు రాధ చుట్టూ పరిభ్రమించడం మొదలు పెట్టాయి.

* * *

ఒకసారి వుధృతంగా వచ్చిన ఏట్లో మోహన్ తల్లి జానకమ్మ కొట్టుకు పోయింది. అందుక్కారణం ఆ ఏటికి వున్న తాటిచెక్కల వంతెన కూలిపోవడమే. అప్పటినుంచి భార్యను కోల్పోయిన మోహన్ తండ్రి రఘుపతి చాన్నాళ్ళ వరకూ మనిషి కాలేక పోయాడు.

అందుకే మరి కొన్నేళ్ళకి విశాఖపట్నం వెళ్ళిపోయాడు మోహన్‌ని తీసుకుని.

ఎప్పటికైనా ఆ ఏటికి వంతెన కట్టించాలనుకున్నాడు. మోహన్‌ని సివిల్ ఇంజినీరింగ్ కూడా చదివించాలనుకున్నాడు.

మోహన్ ధ్యేయం కూడా అదే! అప్పట్లో ఏరు వచ్చినప్పుడల్లా ఏటి ఒడ్డున కూర్చుని ఆలోచిస్తుండే వాడు, తను పెద్దయ్యాక ఆ ఏటికి ఎలాంటి వంతెన కట్టాలా అని; లేదా కట్టించాలా అని.

రాధ మోహన్‌తో ఏటి గట్టుకి వచ్చేది.

మోహన్ తల్లి గుర్తుకు వచ్చి ఏడుస్తూంటే ఓదార్చేది.

"మోహన్! నువ్వు పెద్ద ఇంజనీరువై పోయి, ఈ ఏటికి పెద్ద బ్రిడ్జి కట్టెయ్యాలి. అప్పుడు మనం భయం


LAKSHMI
WET GRINDERS
21 YEARS GLORIOUS SERVICE
SRI LAKSHMI INDUSTRIES
25 DEVANGA HIGH SCHOOL ROAD
COIMBATORE 641 002 • PHONE: 31689
MANUFACTURERS

EXPORTERS
SASI
శ్రీ లక్ష్మి
వెట్ గ్రైండర్స్
గత 21 సంవత్సరాల నుంచీ
ప్రసిద్ధి చెందినది.

లేకుండా ఏటి మీంచి అంచక్కా నడచి పోవచ్చు!'' అనేది కూడా.

రాధ మనసు సున్నితమైంది. ఎంత సున్నితమైందో అంత కఠినమైంది కూడాను. ఏ పనైనా నిదానంగా ఆలోచించి ఆలోచించి ఒక నిర్ణయానికి వస్తుంది.

రాధను గంట క్రితం తలుపు చాటుగా చూశాడు మోహన్.

రాధలో ఎంత మార్పు! చిన్నప్పుడు గలగల పారే సెలయేరులా వుండేది. ఇప్పుడు పెద్దదై గంభీరంగా నిల్చిన నీటి మడుగులా వుంది.

రాధ చివరి సారిగా కంట తడి పెట్టుకుంటూ అంది.

''మోహన్! పెద్ద చదువుల కోసం పట్నం వెళ్ళిపోతున్నావు. నేను గుర్తుంటానా?'' అని.

మొదట్లో ఒకటి రెండు వుత్తరాలు రాసినట్టు గుర్తుంది. ఆ తర్వాత రాధ తల్లి గుండె జబ్బుతో చనిపోయింది. మావయ్య రెండో పెళ్ళి చేసుకోవడంతో ఆ రెండు కుటుంబాల మధ్య సమాంతర రేఖలు ఏర్పడ్డాయి.

* * *

చలపతి కుదుపుల్తో ఆలోచనల్లో నుండి తేరుకున్నాడు మోహన్.

ఏమటలా వెర్రిమొహం వేసుకు చూస్తున్నావు అవతల కొంప మునిగితేను. వరుడు లెప్రసీ రోగి. ఆ విషయం కాళ్ళు కడిగి కన్యాదానం చేసే దగ్గర తేలిందట. వరుడు ఎంత నాగరికత వున్నవాడైనా, ఎంత ధనవంతుడైనా, శాస్త్రప్రకారమేగా పెళ్ళి జరిగేది. కాళ్ళకి వేసుకున్న బూట్లు విప్ప నన్నాడట. మనవాళ్ళు పంతం పట్టి కూర్చుంటే అసలు విషయం తేలింది. బ్రూట్! రాధ బ్రతుకు నాశనం చేయాలనుకున్నాడు.'' ఆవేశంగా చెప్పాడు చలపతి.

''రాధకి ఇంత అన్యాయమా? రాధ ఎక్కడుంది?''

''ఇంకెక్కడుంది! ఈ అవమానాన్ని భరించలేక పరుగెత్తి వెళ్ళి పెరట్లోని బావిలో దూకిందట. వెంటనే దిగి తీశారట. పద వెళ్ళి చూద్దాం.'' అన్నాడు చలపతి.

''ఏమిటీ రాధ ఆత్మహత్య చేసుకుందా?'' అంటూ పరుగు ప్రారంభించాడు చలపతి.

అక్కడ రాధ తండ్రి నెత్తీ-నోరు బాదుకుని ఏడుస్తున్నాడు. యశోదమ్మ కూడా రాగాలాపన చేస్తోంది.

"SELEKT"
Motors and Pumps
IS : 325
ISI

For:- EFFICIANCY, ECONOMY AND TROUBLE FREE SERVICE

Manufactured by :
CHITRA INDUSTRIES
COIMBATORE - 641 005.
Grams : "SELEKT PUMP" Phone: 44543
: సేల్స్ బ్రాంచ్ :
చిత్రా యిండస్ట్రీస్
5-1-446, రాణిగంజ్
సికిందరాబాద్-3 (ఎ. పి.) ఫోన్: 77826
డిస్ట్రిబ్యూటర్స్ :
లక్ష్మి ఏజెన్సీస్
రాణిగంజ్ : : సికిందరాబాదు-3.

మగ పెళ్ళివారు నానా హంగామా చేస్తున్నారు. జీవాన్ని తీసుకుంటూ ముందుకి నడిచాడు మోహన్.

రాధ తడిసిన బట్టల్లో వుంది. వాలుజడలో చెదరిన మల్లెపూలు. నుదిటి కల్యాణ తిలకం. ముడుచుకున్న కలువ రేకుల్లాంటి కళ్ళు. చేతుల నిండా గాజులు. మెడలో జిగిని. చెవులకు జుంకాలు. కాళ్ళకి పట్టాలు.

రాధ పసిడిగుమ్మలా, కావు గీసిన బొమ్మలా, విర బూసిన కొమ్మలా, అరవింద రెమ్మలా వుంది.

ఆమెకి ప్రాణం వుందో లేదో తెలీదు.

చలపతి రాధ నాడి చూశాడు. వెంటనే ప్రథమ చికిత్స చేశాడు. ఆ తర్వాత హాస్పిటల్ తీసుకెళ్ళాడు.

మరో అరగంటలో రాధకి తెలివి వచ్చింది. బెడ్ మీద నీరసంగా పడుకుని వుంది. తండ్రి ప్రక్కనే దిగులుగా వున్నాడు. యశోదమ్మ రాధకి కాఫీ పడుతోంది.

గదిలో అడుగులచప్పుడు విని తేరిపార చూసింది రాధ. మళ్ళీ ముఖం ప్రక్కకి తిప్పుకుంది.

"ఎలా వుంది రాధా, నీ ఒంట్లో?" అడిగాడు చలపతి రాధని చూస్తూ.

"ఎందుకు నన్ను బ్రతికించారు? ఈ అవమానంతో నేను జీవితాంతం కుమిలి కుమిలి చావాలనా?" జీరబోయిన కంఠంతో అంది రాధ.

"అంత మాట లెందుకమ్మా! నీకోసం ఎవరొచ్చారో చూశావా....మోహన్ వచ్చాడు." అన్నాడు చలపతి.

"అవును రాధా! నేనే వచ్చాను. నీ కోసమే వచ్చాను. జరిగిందంతా పీడ కలలా మర్చిపో. ఇన్నాళ్ళు బాధ్యత కోసం బ్రతికాను. ఇప్పుడు బ్రతుకుకోసం బ్రతకాలను కుంటున్నాను. స్వార్థం ఆడించిన జీవిత నాటకంలో నాకు నచ్చని పాత్ర ఇన్నాళ్లూ ధరించాను. సరే! అదంతా గతం. ప్రస్తుతం ఇంకెవ్వరూ మనల్ని వేరు చేయలేదు. నా తప్పు నేను తెలుసుకున్నాను." అన్నాడు మోహన్.

"మోహన్!" అంటూ లేవబోయింది రాధ.

వెంటనే దగ్గరకి జరిగి పట్టుకున్నాడు మోహన్. అతని ఎడమ భుజంమీద తల వాల్చుకుంది రాధ.

"రాధా! మనది వీడని బంధం!" అన్నాడు మోహన్.

చలపతి మోహన్ ధైర్యానికి మెచ్చుకున్నాడు.

రాధ తలిదండ్రుల కన్నుల్లో ఆనంద బాష్పాలు సుడులు తిరిగాయి ఆ క్షణం.




BAJAJ KNITTERS.S.INDIA.

మా ప్రత్యేక తయారింపులు!!

* డి. ఆర్. ఫైన్
* మానసర్
* బజాజ్ ఫైన్
* ఐలెట్
* కూల్ టెక్స
* కాపిటల్
* సంగమ్ ఇంటర్ లాక్
* ఓవిన్
* టిప్‌టాప్
* కింగ్ కాంగ్
* స్కై రాజ్
* రాకెట్

ఇవికాక ర జెట్టీలు ర లండన్ ర సిమిత ర బాబి అన్నిరకాల కలర్ షర్టులు మరియు ఫాన్సీరకాలు అన్ని ప్రముఖ బట్టల షాపులలోనూ దొరుకును.

BAJAJ KNITTERS - Lakshminagar - Tirupur - 638 6012.